నిప్పులు కురిసిన రాత్రి

ఎమ్.వి.వి. సత్యనారాయణ

"కాఫీ తయారైందా?" అడిగాడు రంగారావు.

జయంతి పలకలేదు. రంగారావు తెల్ల కోటు తొడుక్కుంటూ వంటింట్లోకి నడిచాడు. జయంతి కుంపటి ముందు కూర్చుంది. ముందుకు ఒంగి కుంపటిని వూదుతోంది. వంటింట్లో పొగ పలచగా అలుముకుని వుంది. రంగారావు వంగి జయంతి భుజాలమీద చేతులు వేశాడు.

"విసనకర్ర అందుకోండి. పాడు బొగ్గులు.... రాత్రి మంచు పడి తడిసిపోయాయి" అంది జయంతి.

రంగారావు చుట్టూ చూచి కూరగాయల బుట్టకి సమీపంలో వున్న విసనకర్ర అందుకున్నాడు. జయంతి కుంపటి విసరసాగింది.

"సరే, జయా! నేను స్టేషనుకి వెళ్ళి మరలవస్తాను. లేకపోతే హెల్పర్‌ను పంపిస్తాను" అన్నాడు రంగారావు.

జయంతి అతడివంక చూచింది. ఆమె కళ్ళు పొగ తగిలి ఎర్రగా వున్నాయి. ఆమె కళ్ళతడి అతడిని

కదిలించింది.

"జయా! రాత్రికి కిరసనాయిలు తెప్పించుతాను" ప్రేమగా అన్నాడు రంగారావు.

"కాఫీ అయిపోతుంది. పదినిముషాలుండండి!" అంది జయంతి.

కుంపటి మండసాగింది.

"ఆల్ రైట్!" రంగారావు బయటికి నడిచాడు. స్టూలుమీద కూర్చుండి షూ తొడుక్కున్నాడు. ఉన్నట్టుండి చెవులు రిక్కించి వినసాగాడు.

దూరంగా రైలు కూత వినిపిస్తోంది. చకచక నడుచుకుంటూ వాకిట్లోకి వచ్చి నిలబడ్డాడు. రైల్వేస్టేషను ప్లాట్ ఫాంమీద హెల్పర్ నిలబడి వున్నాడు. అతడి చేతిలో ఆకుపచ్చ జెండా ఎగురుతోంది. హెల్పర్ వెనక రేకు షెడ్డు.

హెల్పర్ తలత్రిప్పి రంగారావు వైపు చూశాడు.

"గూడ్సు వస్తోంది సార్! వాత్తేరునుండి!" అన్నాడు హెల్పర్.

రంగారావు తలూపి తిరిగి క్వార్టర్ లోపలికి వెళ్లాడు. డబ్బా తెరిచి బిస్కట్లు తీశాడు. కుర్చీలో కూలబడి మెల్లగా బిస్కట్టును కొరకసాగాడు. అయిదు నిమిషాలలో జయంతి కాఫీ గ్లాసుతో ఆ గదిలోకి వచ్చింది.

బయటనుండి గూడ్స్ ట్రయిను వెళ్తోన్న డబడబ చప్పుడు వినిపిస్తోంది. టకటకా వాగనులు క్వార్టర్సును దాటుతున్నాయి.

రంగారావు కాఫీ త్రాగి బయటపడ్డాడు. చకచక స్టేషను షెడ్డువైపు నడవసాగాడు. ఎంత కాలంనుండి తాను ఇక్కడే ఈ పరిసరాలను అంటిపెట్టుకుని వుంటు

న్నాడో తనకే తెలియదు. మార్పులేని జీవితం. అదే రేకు షెడ్డు ఆఫీసు. ఆ షెడ్డుమీద అదే అక్షరాలు....జగ్గయ్యపాలెం. తాను ఎన్నిమార్లు చదివినా ఆ అక్షరాల్లో వున్న ఒంపులలో ఒక్క ఒంపూ మారదు.

జయంతీ తాను కాపురం పెట్టి నాలుగేళ్ళవుతుంది. తనకి డిగ్రీ పూర్తికాగానే సర్వీస్ కమీషన్ సెలక్షన్ వచ్చింది. అప్పట్నించీ తనని ఇదే స్టేషనులో ఎ.ఎస్.ఎం. (అసిస్టెంట్ స్టేషను మాస్టర్)గా ఉద్యోగం వేశారు. టిక్కెట్లు అమ్మకం దగ్గరనుండి తానే. తనతో బాటు వేసిన క్లర్కు సెలవు పెట్టాడు.

చివరకు జెండా చూపించడం తానే చెయ్యాలి. తనకో హెల్పర్‌ని యిచ్చారు.

లెవెల్ క్రాసింగ్ దగ్గర ఒక వాచ్‌మాన్. ఈ నిర్జనమైన పరిసరాల్లో ముగ్గురే ముగ్గురు వుద్యోగులు. రాత్రీ పగలూ మొత్తం మీద మూడు పాసింజర్లు ఆగుతాయి. పట్టుమని పది టిక్కెట్లు కూడా అమ్ముడుకావు.

ఆలోచనలలో రంగారావు స్టేషను షెడ్డును సమీపించాడు.

“పాసింజరు వస్తోందా?” అడిగాడు రంగారావు.

“ఇంకా లేదండి” అన్నాడు హెల్పరు పచ్చ జెండాను కర్రకి చుడుతూ.

రంగారావు షెడ్డులోపలికి వెళ్ళాడు. బుకింగ్ కౌంటరు ముందు కూర్చున్నాడు. బుకింగ్ కిటికీలోంచి, “గంట కొట్టెయ్యి!” అన్నాడు రంగారావు.

గంట గణగణ లాడింది.

అంతసేపూ ప్లాట్‌ఫాంకి అవతలా యివతలా పచార్లు చేస్తున్నవాళ్ళు బుకింగ్ కిటికీని సమీపించసాగారు.

'పరుగూ, వేగమూలేని జీవితాలు!' గొణుక్కున్నాడు రంగారావు.

టిక్కెట్లు అమ్ముతున్నాడన్న మాటేగానీ, తన ఆలోచనలు వడీ జవా వున్న కాలేజీ రోజులవైపు పరుగులు తీస్తున్నాయి. తాను కాలేజీ మొత్తానికి వాలీబాల్ చాంపియను. తన ఆట చూచే జయంతి తన్ను ప్రేమించింది. ఆమెకీ వెనకాముందూ ఎవరూ లేరు. తన పినతండ్రి యింట అనాథ ప్రేతలాగా బతికే జయంతి తనవెంట జీవితంలోకి నడిచిరావడానికి ఎవరికీ అభ్యంతరం లేకపోయింది.

అయితే తన వైవాహిక జీవితానికి సమగ్రతలేదు. జయంతి కడుపున యింత నలుసు పడుతుందని ఎదురు చూస్తోంది. ఆమెకు గర్భాశయం దోషం.

రంగారావు ఉలిక్కిపడ్డాడు.

అతడి ఆలోచనల దారాలు పట్టుకుని ఎవరో లాగుతోనట్టు ఫీలయ్యాడు.

పీటర్ ! దుర్మార్గుడు!

పీటరు వల్లనే తన జయంతికి ఆ రోగం అంటుకున్నది. గర్భిణి అయే అర్హత కోల్పోయింది.

రంగారావు బుకింగ్ లోంచి బయటకు చూశాడు. బయట ఎవరో భారీ మనిషి నిలబడివున్నాడు.

"ఎక్స్ప్రెస్ ఎన్ని గంటలకు?" అతడి గొంతు కర్కశంగా వుంది.

రంగారావు నుదురు చిట్లించాడు. ప్రభుత్వోద్యోగితో పని చేయించుకునేపాటి సంస్కారం ఈ పుణ్యభూమిలో యెక్కువమందికి తెలియదు.

"ఈసుకొస్తు వెళ్ళిపోయి గంటయింది."

"నేను అడిగేది సింహాద్రి!"

"ఇంకా గంటకి గానీ రాదు!"

"ఈలోపులో పాసింజరు వస్తుందా?"

దూరంగా ఎక్కడో పాలపిట్ట అరుస్తోంది.

"అవును." అన్నాడు రంగారావు.

"వాల్తేరు స్టేషనుకి వెళితే సింహాద్రి అందుతుందా?" అడిగాడు అతడు.

"అందవచ్చు."

"అదేమిటి! అందకా పోవచ్చునన్న మాట!"

"కావచ్చును." చిరాకుగా అన్నాడు రంగారావు.

"ఏం?"

"మీరు వాల్తేరు స్టేషన్‌కి వెళ్ళగలిగే పద్ధతి మీదా, చేరుకోగలిగే సమయం మీదా ఆధారపడి వుంటుంది."

"వాల్తేరు స్టేషన్ దూరమా?"

"మిస్టర్ మీకేం కావాలి?"

"ఎంక్వయిరీ!"

"ఎక్కడినుండో బయలుదేరే బళ్ళ గురించి అడగడం 'ఎంక్వయిరీ' అనిపించుకోదు."

"వాల్తేరు ఎక్కడో లేదు. పది కిలోమీటర్లు!"

రంగారావు బుకింగ్ కిటికీలోంచి వొంగి చూశాడు.

విశాలమైన భుజాలు, పెద్దమొహం, గుబురుగా పెరిగిన గడ్డం, మీసాలూ, వొంకీలు తిరిగి నిర్లక్ష్యంగా వొదిలేసిన జుట్టూ, బలిష్టమైన ఛాతీ....

"ఆల్ రైట్! ఇప్పుడే రోడ్డుమీదకు వెళ్ళండి. సిటీ బస్సు అందుకుంటే పావుగంటలో స్టేషన్ ముందు దిగుతారు."

"ఆ మాట యిందాకనే ఏడవ్వాలసింది!"

రంగారావు వులిక్కిపడ్డాడు. చకచక నడుచుకుంటూ షెడ్డులోంచి బయటికి వచ్చాడు.

ఆ వ్యక్తి అప్పటికే ప్లాట్ ఫాం చివరకి చేరుకున్నాడు. క్వార్టర్స్ వెనక వున్న కట్టను దాటసాగాడు.

2

"ఎవరికోసం ఎదురు చూస్తున్నారు?"

రంగారావు తలత్రిప్పి చూశాడు. హెల్పర్! అతడి చేతిలో కూరగాయల సంచి వుంది.

"ఎవరికోసమూ లేదు!" రంగారావు వెనక్కి తిరిగి ప్లాట్ ఫాంమీదకు నడుచుకుంటూ వెళ్ళాడు. అక్కడక్కడ ప్రయాణీకులు నిలబడి వున్నారు.

"బండి ఎన్ని గంటలకు వస్తుంది మాష్టారూ!" ఎవరో అడుగుతున్నారు.

రంగారావు సమాధానం చెప్పి కట్టవైపు వెనక్కి తిరిగి చూశాడు. తలత్రిప్పి ప్లాట్ ఫాం చివరకు వెళ్ళాడు. దూరంగా ఓవర్ బ్రిడ్జి దాటి ఎత్తులో చిన్న సైజు కొండ దానిమీద సన్నటి చెట్లు, రైలుపట్టాలు వున్నాయి. రైలు పట్టాలమీద ట్రాలీ వస్తోంది. కిరండర్ కి బొగ్గు రవాణా కోసం కట్టిన రైలుపట్టాలు.

రంగారావు కళ్ళు పెద్దవయాయి. రైలుపట్టాలప్రక్క ఎవరో నడుస్తున్నారు. ఇందాక కట్టవ దాటుతోన్న భారీవిగ్రహం! అతడే! అతడు కొండదిగి మెల్లగా రైలు పట్టాలవైపు నడుస్తూ వస్తున్నాడు.

రంగారావు చకచకా అతడు నడుస్తూ వస్తున్నదిశగా వెళ్ళాడు.

భారీవ్యక్తి రంగారావును సమీపించాడు. అతడు తన ఎర్రటికళ్ళతో నిర్లక్ష్యంగా రంగారావును చూసు

కుంటూ షెడ్డువైపు నడిచాడు. రంగారావు చురుకుగా అతడిని సమీపించాడు.

షెడ్డులోంచి గణగణమని ఫోన్ మ్రోగింది.

రంగారావు షెడ్డులోకి ప్రవేశించి ఫోన్ అందుకున్నాడు.

ఫోన్లో మాట్లాడి బయటకు వచ్చాడు. భారీవ్యక్తి దీక్షగా తనవంకే చూస్తూ కనిపించాడు. రంగారావుకు ఏంచేయాలో పాలుపోలేదు. ప్లాట్ ఫాం అంచువరకూ నడిచి తల పంకించి తన క్వార్టరువైపు అడుగులేశాడు. ప్రక్క క్వార్టరుకి తాళం పెట్టివుంది.

జయంతి గుమ్మంలో నిలబడి వుంది. ఆమె కళ్ళలో ఆశ్చర్యమూ భయమూ పెనవేసుకుని కనిపించాయి.

"మీరూ చూశారా వాడిని?"

"ఎవరిని?"

"పీటర్!"

రంగారావు షాక్ తిన్నట్టు చూశాడు.

"నువ్వే కరెక్టు! త్వరగానే గుర్తించావు. అవును వాడే!"

జయంతి రంగారావును సమీపించి అతడి చెయ్యి పట్టుకున్నది. ఆమె నరాలు వొణుకుతున్నాయి.

"జయా! నీకు వచ్చిన ప్రమాదం ఏం లేదు" అన్నాడు రంగారావు.

"ఏమండీ? వాడు పోలీసుల చేతులలో వుండికూడా ఏమన్నాడో గుర్తుందా?"

"ఆఁ! నన్ను చంపుతానంటాడు.... రాస్కెల్!"

"ఇందాక క్వార్టర్సు ప్రక్కనుండి వెళుతూ లోపలికి చూశాడు."

"నిన్ను గుర్తు పట్టాడా?"

"వాడు మన కోసమే వచ్చాడు."

రంగారావు తల్లూపాడు.

"వాడు అప్పుడే జైలులోంచి ఎలా బయట పడ్డాడు?"

"తప్పించుకుని పారిపోయి వచ్చాడేమో!"

"ఎందుకు?"

"కొంపతీసి మనమీద కక్ష తీర్చుకోడానికేమో— నువ్వన్నట్టు—" రంగారావు గొంతు తడారిపోయింది,

"నా మూలంగా మీ జీవితం ప్రమాదానికి బలవుతోంది!"

"జయా! అంత మాటనక. మనం ఇద్దరమూ కలసి జీవించాలనుకున్నాం. పెళ్ళి చేసుకున్నాం. దుర్మార్గుడు మన జీవితాలతో ఆటలాడుతున్నాడు."

జయంతి నిట్టూర్చింది.

దూరంగా పాసింజరు రైలు వస్తోన్న చప్పుడూ, ఆ వెనకనే భోగ్గుఇంజను కూతా వినిపించాయి.

"నువ్వు క్వార్టరుకి లోపల గడియవేసుకుని వుండు. నేను ఈ బండిని చూసుకుని మరల వస్తాను. ఏం ఫరవా లేదు." జయంతిని వదిలిపెట్టాడు. మెల్లగా స్టేషన్ షెడ్డువైపు కదిలాడు. ప్లాట్‌ఫాం మీదకు చూశాడు రంగారావు.

ప్లాట్‌ఫాంమీద నిలబడి పీటర్ క్వార్టరు వైపు చూస్తున్నాడు.

3

చుట్టూ చీకటి. క్వార్టరు వెనుక వున్న కట్టవలోంచి అతడు మెల్లగా నడుచుకుంటూ వచ్చాడు. చీకట్లో కళ్ళు

చించుకు చూస్తున్నాడు. స్టేషన్ షెడ్డులో ఒక దీపమూ ప్లాట్ ఫాం మీద ఒక దీపమూ వెలుగుతున్నాయి. కటిక చీకటిని తరమడం వాటివలన అసాధ్యమవుతోంది.

అతడు మెల్లగా నవ్వుకున్నాడు. క్వార్టరు ముందుకు వచ్చి నిలబడ్డాడు. క్వార్టరుకి తలుపు దగ్గరగా వేసివుంది. కిటికీలోంచి వెలుగు కనిపిస్తోంది.

ఉన్నట్టుండి చటుక్కున వెలుపలి దీపం వెలిగింది. క్వార్టరు ముందు వాకిలి ప్రకాశవంతమయింది. అతడు వులిక్కిపడి చీకట్లోకి తప్పుకున్నాడు. చెవులు రిక్కించి వినసాగాడు. క్వార్టరులోంచి మాటలు వినిపిస్తున్నాయి. మాటలు వినిపిస్తూనే తలుపులు తెరుచుకున్నాయి.

రంగారావు గుమ్మంలో నిలబడ్డాడు. అతడికి కాస్త వెనుకగా జయంతి నిలబడి వుంది. వాళ్ళిద్దరి నీడలూ వాకిట్లో తేటగా పడుతున్నాయి.

"ఎక్స్‌ప్రెస్ వచ్చే టయిమయింది! నేను తిరిగివచ్చి పిలిచేవరకూ తలుపుతీయక." అన్నాడు రంగారావు.

"ఇప్పుడు వెళ్ళకపోతే ఏం?"

"లెవెల్ క్రాసింగ్ గేటు మూసివుందో లేదో చూడాలి."

"హెల్పర్ వున్నాడు కదా!"

"హెల్పర్ కీ వాచ్ మన్ కీ వదిలిపెడితేనే రైలు ప్రమాదాలు జరిగేది."

"మీ చాదస్తం!"

"ఆల్ రైట్ అలాగే అనుకో...."

"నాకు ఎందుకో భయంగా వుంది."

"ఏం?"

"ఫిటర్ మరల వస్తేనో...."

"ఉదయం పాసింజరు ఎక్కి వెళ్ళిపోయాడు కదా, దరిద్రుడు—టికెట్ తీయలేదు."

జయంతి మెల్లగా నవ్వింది. "మీ పాసింజరురైళ్ళలో సగంమందికి టిక్కెట్లుండవు. సగంమందికి సీట్లుండవు. రైట్లు అసలే వుండవు."

రంగారావు మెల్లగా నవ్వి, "వస్తాను తలుపువేసుకో. జాగ్రత్త....అరగంటలో వస్తాను." అంటూ వాకిట్లోకి దిగాడు.

ఆ వెనకనే జయంతి తలుపు మూసుకున్నది.

రంగారావు చకచక ముందుకుసాగాడు. ప్లాట్ ఫాం మీద అడుగుపెట్టాడు. వెనకప్రక్క ఎవరో కదిలినట్లవుతోంది. ఠీరగా వెనక్కి తిరిగిచూశాడు. వెనక ఎవరూ లేరు. రంగారావు మెల్లగా నడవసాగాడు. ఎక్కడో ఎండుపుల్ల పఠక్‌మన్నది. ఎండుటాకులు కరకర లాడాయి.

కొంపతీసి పీటర్ మరల వచ్చాడా?

పాసింజరు ఎక్కి వెళ్ళినవాడు తిరిగి ఎలా వచ్చాడు? అతడు పాసింజరుమీద వెళ్ళిపోవడం కేవలం నటనా?

వెళ్ళినట్లే వెళ్ళి తిరిగివచ్చి ఈ చీకట్లో....

రంగారావుకు గుండెలు గుబగుబలాడాయి. ఎందుకు వస్తాడు? పీటర్ తనమీద కక్ష గట్టాడా? నాలుగేళ్ళ క్రితం నాటి కక్ష ఇంకా అతడి మనసులో సజీవంగా వుంటుందా? వుండివుంటే....తనని చంపుతాడా? తాను ఈ చీకట్లో ఒంటిగా బయలుదేరి తప్పు చేశాడా?

ఎక్కడో కంకరరాళ్లు కరకరలాడాయి.

రంగారావుకు తన తలలో శూన్యం ఏర్పడినట్లు తోచసాగింది. తాను హెల్పరును ఎటో పంపడం తప్పయింది.

అతడే మొదటి ఆట సినిమాకి వెళ్ళి వస్తానన్నాడు. సినిమాకి వెళ్ళాడో, ఎక్కడికి వెళ్లాడో..వాడికి వ్యసనా లున్నట్టు లెవెల్ క్రాసింగ్ గేటుకీపరు చెబుతూంటాడు.

రంగారావు తన కాళ్ళలోకి శక్తిని తెచ్చుకుని పరుగు పెట్టాడు. ప్లాట్ ఫాంకి ఆ చివర ముప్పయి గజాల్లో గేటు వుంది. ఆ గేటులోంచే రహదారి రైల్వేలైనుకు అడ్డంగా ప్రయాణిస్తోంది. గేటుకీపరు తాగుబోతు. వాడి ఏమరు పాటుతనం వలన ఏ ప్రమాదమయినా జరిగితే..

దూరంగా ఎక్కడో డీజల్ ఇంజను కూత విని పించింది.

'బండి ముందుస్టేషను దాటుతూ వస్తోంది.' గొణు క్కున్నాడు రంగారావు. కేబిన్ ప్రక్కగా పరిగెత్తుతూ గేటును సమీపించాడు. గేటువద్ద హరికేన్ లాంతరు గుడ్డి వెలుతురును ప్రసాదిస్తోంది. గేటు మూసి వుంది.

"సింహాచలం!" అరిచాడు రంగారావు.

నిశ్శబ్దంలో ప్రతిధ్వనించి అతడి పిలుపు చీకటిలో కలిసిపోయింది. కేబిన్ లోపలికి తొంగిచూశాడు. లోపల చిన్న దీపం వెలుగుతోంది. సింహాచలం గోడకి చారగిల పడి కనిపించాడు. అతడి కళ్ళు సగం తెరిచివున్నాయి.

"సింహాచలం మరల త్రాగి నిద్దరోతున్నావా?" అరిచాడు రంగారావు. అకస్మాత్తుగా అతడి చెవులకు గాలిలో ఎవరో కదులుతోన్న శబ్దమయినట్టు వినిపించింది. రంగారావు తలత్రిప్పి చూశాడు.

అతడికి తన గుండె తెగి కిందపడినట్లు తోచింది.

గేటు దగ్గరగా దీపం వెలుతురులో ఎవరో నిలబడి వున్నారు.

"ఎవరు?" రంగారావు గొంతు జీరబోయింది.

ఆ వ్యక్తి మెల్లగా రంగారావువైపు నడిచి రాసాగాడు.

"పీటర్!" అరిచాడు రంగారావు.

ఆ వ్యక్తి పకపక నవ్వాడు. చీకట్లో ప్రేతాలు నవ్వుతోన్నట్టుగా ఫీలయ్యాడు రంగారావు.

"ఎందుకు వచ్చావు?"

"నీ ప్రాణాల కోసం."

"సింహాచలం! సింహాచలం!" రంగారావు కాబిన్ లోకి పరుగెత్తాడు. తలుపులు దగ్గరగా వేశాడు. అంతలోనే ఆ వ్యక్తి తలుపుకు మధ్యగా కాలుపెట్టాడు. అతడిని తోసుకుని లోపలికి వచ్చాడు. రంగారావు అతడిని మృత్యువును చూచినట్టు చూశాడు. అతడి చేతిలోని కత్తి తళతళలాడింది.

డీజల్ ఇంజన్ హోరుపెడుతూ గేటు దాటుతోంది.

4

"జయా!" పిలిచాడు బయటినుండి.

జయంతి తలుపు తీయబోయేదల్లా ఆగింది.

"జయా! త్వరగా తలుపు తీయి....పీటర్...."

జయంతి చటుక్కున గడియతీసి తలుపులు తెరిచింది. గుమ్మంలో అతడు నిలబడి వున్నాడు. అతడి గుబురు గడ్డంలోంచి కళ్లు కక్కే ఎర్రదనం ప్రతిబింబిస్తోన్నట్టుగా ముఖంమీద రక్తం! బట్టలమీద రక్తం!

జయంతి కెవ్వున అరిచింది.

అతడు పకపకా నవ్వాడు. మెల్లగా లోపలకు నడిచాడు. జయంతి స్పృహతప్పి పడిపోయేదల్లా అతడు చాపిన చేతులలోనికి ఒరిగిపోయింది. అతడు జయంతిని ఎత్తుకుని మంచంవైపు నడిచాడు. ఆమెను మంచంమీద

పడుకోబెట్టాడు. దీపం వెలుతురులో ఆమెను పరీక్షగా చూడసాగాడు.

దంతం రంగులో వున్న ఆమె శరీరం దీపంవెలుగులో మెరుస్తోంది. సన్నటి నడుమూ, యవ్వనం ఒంపులూ ఆమె శరీరానికి వింత ఆభరణాలుగా అమిరాయి. భయపడటం వలన కాబోలు ఆమె ఆయాసంగా ఒగరుస్తోంది. విశాల మైన ఆమె నేత్రాలు మూతపడి వున్నాయి. పల్చటి చెక్కిళ్ళూ, కొనదేలిన గడ్డమూ, వొంకీలు తిరిగిన జుత్తు పడుతోన్న చెంపలూ, చెవులూ, పొడవుపాటి ముక్కూ ఆమె అందానికి తళుకులద్దుతున్నాయి.

అతడు చటుక్కున వంగి ఆమెను ముద్దుపెట్టుకున్నాడు. ఆమె ఒళ్ళు నిమిరాడు. అతడిలోని నరాలు పురులు విప్పాయి. కోరిక చెలరేగింది. పెదిమలు కొరుక్కున్నాడు. ఆమె ప్రక్కగా కూర్చున్నాడు. అతడి నరాలు పట్టుతప్పుతున్నాయి.

చటుక్కున లేచి తలుపు మూయబోయాడు. అతడి కళ్ళు పెద్దవయాయి. రేకుపెడ్డుదగ్గర వెలుగులో ఎవరో నిలబడివున్నారు. అతడు అటూ యిటూ చూచి మెల్లగా క్వార్టర్సువైపు రాసాగాడు.

అతడు పళ్ళు పటపట నూరాడు.

* * *

సింహాచలం మెల్లగా కదిలాడు. తన శరీరం కింద వెచ్చగా ప్రవహిస్తోంది. చేతితో కింద తడిమాడు. చేతికి వెచ్చగా తగిలింది. చేయి అంతా జిగురయింది. సింహాచలం చటుక్కున కళ్ళు తెరిచాడు. మగతగా చూశాడు. గదిలో దీపం వెలుగుతోంది. ఎక్కడినుండో కీచురాయి గీపెడు తోంది.

సింహాచలం వులిక్కిపడ్డాడు. కళ్ళు నలుపుకొన్నాడు. తను చూస్తోంది కలా? నిజమా? తాగిన మత్తులో ఇలా కనిపిస్తోందా? ఒక మూలగా పెద్ద చందువా పెట్టె— ఆ పెట్టెప్రక్క నేలమీద ఎవరో వెల్లికిలా పడివున్నారు. అతడి గుండెప్రాంతంలో పిడివరకూ కత్తి దిగివుంది. అతడి బట్టల నిండా రక్తం ప్రవహిస్తోంది. రక్తం ప్రవాహం కట్టింది. తనవైపు ప్రయాణిస్తోంది. ఆరక్తమే తనని మత్తులోంచి నిద్రలేపింది. సింహాచలం గజగజ లాడాడు.

అతడు ఎవరు? ఎవరు చంపారు?

సింహాచలం ఒక్కసారిగా శక్తిని కొనితెచ్చుకుని లేచాడు.

తాను 'చావు'లను చూశాడు. కాని మరీ యింతగా యింత దగ్గరగా హత్యను చూడలేదు. గడగడలాడు తోన్న చేతులతో దీపంబుడ్డిని అందుకుని శవం మొహం దగ్గరకు తీసుకువచ్చాడు.

వెన్నులోంచి చలి పుట్టుకొచ్చింది. చటుక్కున బయటికి గెంతాడు. చేతిలోని దీపాన్ని గుమ్మంలో ఎలా పెట్టాడో తెలియదు. దెయ్యం తనని తరుముతోన్నట్టుగా పరుగెత్తాడు. ప్లాట్ ఫాం మీద అతడి అడుగులు ప్రతి ధ్వనించి భయంకరమైన చీకటికి నేపథ్య సంగీతం చేకూర్చి పెట్టాయి.

సింహాచలం షెడ్డును సమీపించాడు. దీపం వెలుగు తోంది. వెలుగులో షెడ్డుకు తాళంపెట్టి వుండినట్లు గమ నించాడు. ఎక్కడాలేని పిచ్చి ఆవేశం సింహాచలంలో ప్రవేశించింది.

చకచక గంటను సమీపించాడు. ఇనుపకడ్డీని చేతిలోకి తీసుకున్నాడు. తాళంమీద బలంకొద్దీ కొట్టాడు.

తాళం పగిలింది. పెద్ద తలుపు తెరిచాడు. లోపలకు దూకాడు. టెలిఫోన్ అందుకున్నాడు.

చకచక నెంబర్లు తిప్పసాగాడు.

గుమ్మం దగ్గర అలికిడయింది. చటుక్కున తల త్రిప్పి చూశాడు సింహాచలం. దీపం వెలుగులో భారీ విగ్రహం నిలబడి వుంది. ఆ ఆకారం గుమ్మందాటి సింహాచలాన్ని సమీపించింది.

“ఎవరు నువ్వు?” కీచుమన్నాడు సింహాచలం.

ఆకారం పకపక నవ్వింది. గుబురు గడ్డంలోంచి తెరలు తెరలుగా నవ్వాడు. అతడి చేతిలోని ఇనుపకడ్డీ పైకి లేచింది.

5

“డిసీజ్ క్రైంబ్రాంచ్ ఆఫీస్!” అన్నాడు కుమార్ ఫోన్‌లో.

“ఎవరు మాట్లాడేది?” అవతలనుండి వినిపించింది.

“ఇన్స్పెక్టర్ కుమార్!”

“హలో .... కుమార్ జీ నమస్తే. నేను డివిజినల్ సూపర్నెంటు—సౌత్ ఈస్ట్రన్ రైల్వే.”

“సహానీగారా! నమస్తే సార్!”

“నమస్తే! వాల్తేరు — విజయవాడ మార్గంలో వాల్తేరుకు పది కిలోమీటర్ల దూరంలో జగ్గయ్యపాలెం రైల్వే స్టేషనులో ఎ. ఎస్. ఎం.ని ఎవరో హత్య చేశారు. మీరు వెంటనే బయలుదేరాలని నా కోరిక. నేను హత్యా స్థలానికి వస్తున్నాను.”

“ఆల్ రైట్! వస్తున్నాను” కుమార్ రిసీవర్ పెట్టి

హుడావుడిగా లేచాడు. సార్జెంటువైపు సాభిప్రాయంగా చూశాడు.

సార్జెంటు బయిటికి వెళ్ళాడు.

ఇన్స్పెక్టర్ కుమార్ వాచీ చూసుకున్నాడు.

రాత్రి 1 గం॥ 30 ని॥

చకచక డ్రెస్ సర్దుకున్నాడు.

అరగంటలో జగ్గయ్య పాలెం రైల్వే స్టేషనుకి కొద్ది దూరంలో పోలీసువాను ఆగింది. కుమార్, అతడి సిబ్బందీ జీపు దిగారు.

కుమార్ ప్లాట్ఫాం మీదకు దూకాడు.

ప్లాట్ఫాం సందడిగా వుంది. అయిదారు పెట్రోమాక్స్ లైట్లు వెలుగుతున్నాయి. డివిజినల్ సూపరెన్టెంటు సహానీ కంగారుగా షెడ్డు లోపలికి వెళ్తూ కనిపించాడు. కుమార్ చకచక అటు నడిచాడు. కుమార్ షెడ్డును సమీపించేసరికి సహానీ బయటికి వచ్చాడు. అతడి ముఖంలో భయం విచారం కనిపించాయి.

కుమార్ను చూడగానే ప్రాణం లేచివచ్చినవాడిలా చూశాడు.

"థాంక్యూ మిస్టర్ కుమార్! ఫోన్ చెయ్యగానే వచ్చారు. వాచ్మాన్ కాబోలు లోపల ఫోను దగ్గర స్పృహ తప్పి వున్నాడు."

కుమార్ తలూపి లోపలకు నడిచాడు.

"మై గుడ్ నెస్! ఇతడి ప్రాణాలు పోలేదు" వంగి కడ్డీని చూశాడు—కుమార్. ఇనుపకడ్డీ ఎర్రబడివుంది. వాచ్మాన్ తలవైపు చూశాడు. తలమీద రక్తం గడ్డ కట్టివుంది.

"హత్య జరిగింది ఎక్కడ?" అడిగాడు కుమార్.

"ఎ. ఎస్. ఎమ్. క్వార్టర్‌లో నేమో?"

"మీకు ఫోను ఎవరు చేశారు?"

"అనకాపల్లి స్టేషను మాస్టర్!"

"అదేమిటి?"

"ఎవరో యిక్కడినుండి అనకాపల్లికి ఫోను చేశారట! అవతల ఫోను ఎత్తారట ఎస్. ఎం. (స్టేషను మాస్టరు) అంతే. తర్వాత ఏమీ వినిపించలేదట! టక్‌మన్న శబ్దమూ, మూలుగూ వినిపించాయట.

"హలో ...." అన్నారట ఎస్. ఎం.

"హలో....జగ్గయ్య పాలెం ఎ. ఎస్. యెం. చని పోయాడు. యెవరో చంపారు" అని వినిపించిందట. ఫోనులో.

"మీరెవరు?" అడిగాడట యెస్. యం-

ఇక్కడ ఫోను క్లిక్‌మన్నదట.

వెంటనే ఆయన నాకు ఫోనుచేశాడు" అన్నాడు డి. సూపర్నెంట్ సహానీ.

కుమార్ తల త్రిప్పి సార్జెంటుకు సైగ చేశాడు.

మరో నిమిషంలో వ్రేలిముద్రల నిపుణుడు, డాక్టరూ, ఫోటోగ్రాఫరూ షెడ్డులో ప్రవేశించారు. కుమార్ క్వార్టర్‌లోకి నడిచాడు. లోపలి గదిలో ఆదమరచి మంచంమీద ఒక స్త్రీ నిద్రపోతోంది.

కుమార్ క్వార్టరు సోదా చేశాడు.

ఆమె తప్పించి క్వార్టర్‌లో యెవరూ లేరు.

"మిష్టర్ కుమార్!" సహానీ అరిచాడు.

కుమార్ బయటకు బరుగెత్తాడు. పెట్రోమాక్స్‌లైట్లు చెట్టువెనక గుమిగూడాయి. కుమార్ అటు నడిచాడు. చెట్టుక్రింద యువకుడొకడు బోర్లగిల పడివున్నాడు. అతడి

నగుంవైపు చూశాడు కుమార్.

ప్రక్క ఎముకలు క్రిందకూ మీదకూ లేస్తున్నాయి.

కుమార్ అతడిని వెల్లకితలా త్రిప్పాడు.

"హాల్వర్!" పెట్రోమాక్స్‌లైట్లు పట్టుకున్న వారిలో ఒకడు అన్నాడు.

కుమార్ అతడిని తేరిపార చూశాడు.

అతడికి పాతికేళ్ళుంటాయి. నల్లటి శరీరం. చారల బనీనుమీద నల్లటిపాంటు టక్ చేసి సాండక్ బెల్టుబూటు కట్టుకున్నాడు.

"కానిస్టేబుల్స్!" పిల్చాడు కుమార్.

కానిస్టేబుల్సు పలికారు.

"స్టేషను చుట్టుప్రక్కల అంగుళం అంగుళం గాలించండి. జాగ్రత్త! అడుగుజాడలు...."

"సార్! ఇన్స్పెక్టరుగారూ! వాచ్‌మాన్‌కి తెలివి వచ్చింది."

"వెరీగుడ్!" కుమార్ పరుగెత్తాడు.

6

కాలింగ్ బెల్ గణగణలాడింది.

డిటెక్టివ్ శరీష్ బద్ధకంగా లేచాడు. నైట్‌గౌను సవరించుకుంటూ తలుపు తీశాడు.

తలుపులకు అవతల వృద్ధుడిని చూశాడు.

"ఎవరు కావాలి?" అడిగాడు శరీష్.

"మీరే బాబూ! మా అబ్బాయిని ఎవరో చంపేశారు." వృద్ధుడు వెక్కి వెక్కి ఏడవసాగాడు.

శరీష్ అతడిని సానుభూతిగా చూశాడు.

"లోపలకు రండి." దారి చూపించాడు శరీష్. వృద్ధుడు లోపలికివచ్చి సోఫాలో కూర్చున్నాడు.

శిరీష్ నోరు బ్రష్ చేసుకుని వచ్చాడు.

సునీత యిద్దరికీ బ్రూ సర్వ్ చేసింది.

"ఇప్పుడు చెప్పండి!" అన్నాడు శిరీష్.

వృద్ధుడు తేరుకున్నాడు.

"మా అబ్బాయి రంగారావు. మా యింట్లో ఎవ్వరికీ ఇష్టంలేకపోయినా జయంతి అనే అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు...." అని చెబుతూ రంగారావు గురించిన పూర్తి వివరాలు చెప్పాడు వృద్ధుడు.

"ఈ తెల్లవారుజామున మా యింటికి కబురుపంపాడు డివిజినల్ సూపర్నెంటు. మా అబ్బాయిని కత్తితో...."

వృద్ధుడు ఏడవసాగాడు.

డిటెక్టివ్ శిరీష్ అతడిని ఓదార్చలేదు.

చాలవరకు దుఃఖభారాన్ని ఆ సమయంలో కన్నీళ్ళు తగ్గిస్తాయి.

"క్షమించండి." అన్నాడు వృద్ధుడు పావుగంట తర్వాత.

"మావాడిని చంపిన వాడిని పట్టుకుని...."

"కేసు పోలీసులు టేకప్ చేశారుకదా? వెయిట్ చేయండి!"

"అలాకాదు. మరింత త్వరగా సులువుగా పరిష్కరిస్తారని ఆశతో మీ వద్దకు వచ్చాను. నా శక్తివంచన లేకుండా మీ ఫీసు ఇచ్చుకుంటాను."

"రంగారావు మీద ఎవరికయినా కక్ష వుందా?"

"మా అబ్బాయి పోగరుబోతుకాదు. ఘర్షణపడటం నచ్చదు."

"మీ స్వగ్రామం?"

"పెద్దాపురం."

"ఆశ్చర్యం. పెద్దాపురంనుండి ఇంత త్వరగా విశాఖ పట్నం చేరుకున్నారు."

"టెలెక్స్‌లో అక్కడి పోలీస్ స్టేషనుకి వార్త పంపించారు. ప్రక్కనే మా ఇల్లు."

"గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చారా?"

"అవును."

"మీ అబ్బాయిని మీరు యింకా చూడలేదు."

"తట్టుకోలేను."

"సరే, నేను అయిదునిమిషాల్లో తయారయి వస్తాను." శిరీష్ సమాధానం కోసం ఎదురు చూడకుండా లోపలికి నడిచాడు.

పదినిముషాల్లో తారురోడ్డుమీద దూసుకుపోతోన్న డాట్సన్‌లో ఇద్దరూ కూర్చున్నారు. శిరీష్ నేర్పుగా డ్రయివ్ చేస్తున్నాడు.

"మీ పేరు?" అడిగాడు శిరీష్.

"రాజయ్య."

"మీకు ఎంతమంది పిల్లలు?"

"రంగారావు ఇంటికి పెద్దవాడు. అతడి తర్వాత ఇద్దరు అమ్మాయిలు."

"పెళ్ళిళ్ళయాయా?"

వృద్ధుడు తలూపాడు.

"చూడండి రాజయ్యగారూ! మీ కోడలు ఎటువంటిది?"

"ఆ అమ్మాయి కూడా బాగా చదువుకున్నది బాబూ! మర్యాదగా ప్రవర్తిస్తుందని విన్నాను."

"ఆమెదీ పెద్దాపురమేనా?"

"కాదు!"

"ఆమెతో రంగారావుకు ఎలా పరిచయం?"

"నాకు ఏమీ తెలియనివ్వలేదు బాబూ! రంగారావు నా దగ్గర దాచాడు."

"ఆ అమ్మాయి తరఫున కూడా యెవరూ తెలియదన్న మాట!"

"అవును బాబూ!"

డిటెక్టివ్ శిరీష్ బ్రేకువేసి కారు ఆపాడు. లెవల్ క్రాసింగ్ గేటు తెరిచివుంది. గేటు ప్రక్కనే వున్న కాబిను బయట నేల యీనినట్టు పోలీసులు! నిద్రలేక కాబోలు వాళ్ళ కళ్ళు యెర్రగా వున్నాయి. వాళ్ళలోంచి ఇన్స్పెక్టరు కుమార్ నడచి వచ్చాడు. డాట్సను కారును సమీపించాడు.

"గుడ్ మార్నింగ్ కుమార్!" అన్నాడు శిరీష్, కారు దిగి.

కుమార్ తలూపి, "గుడ్ మార్నింగ్! ఆయనెవరు?"

"రంగారావు తండ్రి రాజయ్యగారు."

కుమార్ విచారంగా చూశాడు. రాజయ్య కారుదిగి మొహాన్ని అరచేతులలో కప్పుకున్నాడు.

"రాత్రినుండి ఇక్కడే వున్నట్టున్నారు" అడిగాడు శిరీష్.

"అవును. శవం దొరకలేదు!"

శిరీష్ వులిక్కిపడ్డాడు.

"మీరు వచ్చేటప్పటికే శవంలేదా?"

"అలాగే అనుకోవాలి" కుమార్ చనువుగా శిరీష్ భుజంతట్టి దూరంగా నడిపించుకు వెళ్ళాడు.

"రంగారావును హత్యచేసి కాబినులో విడిచాడు హంతకుడు. ఆ తర్వాత వాచ్‌మాన్‌నీ, హెల్పరునీ

గాయపరచి స్పృహ తప్పించాడు. ఈ సంఘటనలకి కాస్త ముందో వెనకో జయంతిని—ఐ మీన్ రంగారావు భార్యను రాక్షసంగా అనుభవించాడు. ఆమెను కోమాలో విడిచాడు. శవం మాయమైంది. హంతకుడే శవాన్ని తీసుకుని మాయిమయి వుంటాడు."

"వింతగా వుంది. హంతకుడికి శవం దేనికి?"

"హంతకుడు పిచ్చెత్తినట్టు ప్రవర్తించాడు. వాడే ఇక్కడ హత్య జరిగినట్టు టెలిఫోనులో చెప్పాడు." అన్నాడు కుమార్ వివరిస్తూ.

"శవాన్ని మోసుకు వెళ్ళాడంటావా?"

"కాబినులోంచి బయటివరకూ కెట్స్ ముద్రలు స్పష్టంగా అచ్చాయ్యాయి. హతుడి రక్తంతో హంతకుడి కెట్స్ తడిశాయి. తడివున్నంత మేర అడుగుజాడలు పడ్డాయి. వాటినిబట్టి అవతలి ప్రక్కన వున్న సిగ్నల్ స్తంభంవైపు శవాన్ని మోసుకుంటూ వెళ్ళినట్లు అర్థం చేసుకున్నాను."

"అంటే ప్లాట్ ఫాంకి అవతలగా వున్న సిగ్నల్ స్తంభం వైపా?" శరీఫ్ సాలోచనగా అడిగాడు.

కుమార్ తలూపి, "ఎందుకో మాత్రం తెలియలేదు!" అన్నాడు.

"శవం కోసం వెతికించావా?"

"వూఁ! ఫలితం లేకపోయింది" కుమార్ తలత్రిప్పి సార్జంట్ వైపు చూశాడు. సార్జెంట్ పాకెట్ అందించాడు.

శరీఫ్ పాకెట్ విప్పిచూశాడు. రక్తంతో యెర్రబడిన కత్తి! కత్తిమీద అక్కడక్కడా పౌడరు స్ప్రే చేసి వుంది.

"హంతకుడు ఈ కత్తివల్లనే ప్రాణం పోగొట్టుకున్నట్లు సర్జను అభిప్రాయపడ్డాడు."

"ఐ. సీ."

"ఈ కత్తి యెక్కడ దొరికింది?"

"విచిత్రం! సిగ్నల్ స్తంభానికి కాస్త అవతలగా రైలు పట్టాల మధ్య."

శిరీష్ నుదురు చిట్లించాడు.

"ఈజిట్! పద మనం అక్కడికి వెళ్దాం!"

కుమార్ తలూపి, దారితీశాడు. సిగ్నల్ స్తంభం దాటాడు. రైలు పట్టాలమధ్య రాళ్ళు పేర్చి కాగితం పెట్టి వుంది.

"ఆ కాగితాన్ని గుర్తుకోసం నేనే వుంచాను. పట్టాల మధ్య యెలాంటి అడుగుజాడలూ లేవు. ఈ పట్టాల కివతలగా వున్న ఇనుపబడ్డీల మధ్య మాత్రం అడుగుజాడలు ఉన్నాయి."

"హంతకుడు తెగించినవాడు! తెలివిగా శవాన్ని యెత్తుకుపోయాడు!"

"యెందుకు?"

"నా వూహ కరెక్టే అయితే హంతకుడు కేవలం తమాషా కోసం శవాన్ని యెత్తుకుపోయి వుండాలి!"

"యెలా?"

"చెబుతాను" శిరీష్ మనసులో గుణించుకున్నాడు. "ముందు అనకాపల్లికి ఫోను చెయ్యి. రైళ్ళ వివరాలు—అయ్ మీన్ నిన్న రాత్రినుండి ఇప్పటివరకూ"

"రైల్వే స్టేషనుకా?"

శిరీష్ తలూపి స్టేషను షెడ్డువెపు కదిలాడు. కుమార్ చకచక అతడిని వదిలిపెట్టి షెడ్డులో ప్రవేశించాడు.

రెండు నిమిషాలలో అనకాపల్లి ఎస్. ఎం. పలికాడు.

శిరీష్ ముందుకు సాగి సర్జనుని సమీపించాడు. సరిగ్గా అప్పుడే గేటువద్ద ట్రాలీ ఆగింది. ఇద్దరు పోలీసులు దిగారు. వాళ్ళ మొహాలు ప్రేతకళ పడివున్నాయి. వాళ్లు ట్రాలీ దిగి సర్జనువైపు వచ్చారు.

"శ్రీ తపాళెం స్టేషనుకి రెండు మైళ్ళ దూరంలో శవం కాలుతోంది డాక్టరుగారూ!" అన్నారు పోలీసులు.

సర్జను వులిక్కిపడ్డాడు.

"శవం పూర్తిగా కాలిపోయిందా!" అడిగాడు శిరీష్.

"చాలవరకూ బాగ్గు అయిపోయింది. ఆర్పే సాధనం లేక వెనక్కి తిరిగివచ్చాం."

తెల్లవారేలోగా రెండు గూడ్స్ ట్రయిన్సు అనకాపల్లి వెళ్ళాయి.

ఇద్దరు గార్డులు కూడా ఇక్కడ ఎలాంటి సిగ్నల్స్ ఇవ్వకపోవడం గుర్తించారు." అన్నాడు కుమార్ అప్పుడే అక్కడికి వచ్చి.

"అంటే రెండు గూడ్స్ ట్రయిన్సూ ఈ స్టేషను సిగ్నల్స్ స్తంభాల ముందు ఆగాయన్న మాట!"

"అవును. అప్పుడే హంతకుడు శవాన్ని వాగన్సు మధ్యవుండే షంటింగ్ పాయింట్స్‌మీద వేసి తీసుకు పోయాడు."

"కరెక్ట్. ఆ ట్రయిన్సులో ఒకదానిమీద వెళ్ళి ఎక్కడ వీలు కుదిరితే అక్కడ ఆ ట్రయిన్ విడిచిపెట్టి శవాన్ని తగలేశాడన్న మాట!" అన్నాడు శిరీష్ సంగతిని వివరించి.

"హతుడి గుండెలో కత్తి గుచ్చుకొని వుండడటం వాచ్‌మన్ సింహాచలం చూశాడు. శవాన్ని షంటింగ్

పాయింట్స్‌మీద వేసేటప్పుడు కత్తి జారిపడిపోయిందన్న మాట!"

శిరీష్ నిట్టూర్చాడు. మెల్లగా కాబిన్‌లోకి నడిచాడు.

"హతుడు మరణించే ముందు నేలమీద అక్షరాలు రాశాడండి. 'పీటర్' — 'గ్రూప్ ఫోటో' .... ఇంతే రాశాడు. వాటిని ఫోటో తీశాను—" అన్నాడు ఫోటోగ్రాఫరు.

"వెరీగుడ్!" శిరీష్ కళ్లు మెరిశాయి.

7

జయంతి మంచం దిగింది. మిగతా బెడ్స్‌మీద రోగులు పడుకుని వున్నారు. బెడ్స్ దాటుకుంటూ అడుగులు వేస్తోంది.

'ఉదయం పదకొండయివుంటుంది' కళ్ళు రెపరెపలాడించింది. వార్డులోకి స్టాఫ్‌నర్సు వస్తోంది. జయంతి ఆమెను భయంగా చూసింది. తనకి ఇవ్వవలసిన మామూలు కోసం రాత్రినుండి తినేస్తోంది తనని.

జయంతి గొంతు తడుముకున్నది.

తనకేమయింది?

"ఇక్కడ నిలబడ్డావేం?" స్టాఫ్‌నర్సు గయ్‌మన్నది.

జయంతి ఆమెను భయంగా చూసింది. మెల్లగా తన బెడ్‌ను సమీపించింది.

"చీఫ్ వస్తారని తెలియదా?" మరల గంయ్‌మన్నది.

జయంతి తెలుసునన్నట్టు తలూపింది. బెడ్‌మీద పడుకుంది.

తన గొంతుకు ఏమయింది? తాను ఎందుకు మాట్లాడలేకపోతోంది? స్టాఫ్‌నర్స్ ప్రక్క బెడ్‌వద్దకు వెళ్ళి 'మామూలు' కోసం గొణుగుతోంది.

జయంతి కళ్ళు మూసుకుంది. ఆలోచనలు ఆమె మన సును చీకాకు పరుస్తున్నాయి. ఆ రాత్రి పీటర్ ....

తాను తలుపు తీసింది. గుమ్మంలో వెలుగుతోన్న కాంతిలో పీటర్ తమ గుమ్మంలో నిలబడివున్నాడు. తన భర్త వచ్చినట్టు భ్రమపడి తాను తలుపు తీసింది.

అతడు పకపకనవ్వి తనని సమీపించసాగాడు. తన తల తిరిగింది. ఆ తర్వాత ఏం జరిగిందో తనకి తెలియదు. స్పృహతప్పి వుండాలి.

తిరిగి స్పృహలోకి వచ్చేసరికి పీటర్ తన ప్రక్కనే నిలబడి వున్నాడు. అతడి భుజాన ఎవరో పడుకుని వున్నారు.

పీటర్ పకపక నవ్వి "ఏయ్ పిల్లా!" అన్నాడు.

తాను నిర్ఘాంతపోయి చూడసాగింది. తన పొత్తి కడుపు పచ్చిగా వుంది. కండలు మండిపోతున్నట్టుగా అనుభూతి!

"నీ మొగుడు! చంపేశాను!" అన్నాడు పీటర్.

ఆ మాటలు తన మస్తిష్కం మీద సమ్మెట పోట్ల లాగా తగిలాయి.

పీటర్ తన భుజంమీదనుండి బరువు దించుకుని నేల మీద పడుకోబెట్టాడు.

తాను చూస్తోంది కలా? నిజమా?

తన భర్త రంగారావు నేలమీద పడివున్నాడు. అతడి గుండెలలో కత్తి! ఎర్రటి, చిక్కటి నెత్తురు అంటిన కత్తి.

పీటర్ కత్తిపిడిని కదిపాడు. అది అటూ యిటూ వూగి ఆగింది.

తాను కవ్వున అరిచింది.... అరుస్తోంది!

ఆశ్చర్యం! గాలేతప్ప తన గొంతులోంచి ఎటువంటి శబ్దమూ రావడంలేదు. తనకి పురల స్పృహతప్పింది.

జయంతికి భయంతో ఒళ్ళు జలదరించింది.

ఆ రాత్రి తన జీవితంలో నిప్పులుకురిసిన రాత్రి!

ఆ రాత్రి తన భర్తను దుర్మార్గం పొట్టను పెట్టుకున్న రాత్రి!

జయంతికి కళ్ళలో నీళ్ళునిండాయి.

పీటర్ తన జీవితాన్ని మొదటినుండీ వెంటాడుతున్నాడు. రంగారావు మీద కక్ష పెంచుకున్నాడు. చివరకు తన జీవితాన్ని నాశనం చేయడంలో కృతకృత్యుడయాడు.

జయంతి వులిక్కిపడి పక్కకిచూసింది. చీఫ్ సర్జన్ అండ్ డాక్టర్! తన బెడ్ చుట్టూ హౌస్ సర్జన్లు నిలబడివున్నారు.

వాళ్లు ఏం మాట్లాడుకుంటారో తనకి తెలుసు. రాక్షసరతివలన తను కోమాలో పడింది. ఊహించని దృశ్యం చూచి తనకి మాట పడిపోయింది.

పావుగంట తర్వాత చీఫ్ పిల్లల కోడిలాగా వార్డులోని బెడ్స్ చుట్టూ పచార్లు చేయసాగాడు.

జయంతి గుమ్మంలోకి చూసింది.

కానిస్టేబుల్సు యిద్దరు తన బెడ్ మీద నిఘావేసి కూర్చున్నారు.

డిటెక్టివ్ శరీఫ్ ఇన్స్పెక్టర్ కుమార్ తో మాట్లాడి ఈ ఏర్పాటు చేశారట! జయంతి నిట్టూర్చింది.

చివరకు తన బతుకు ఇలా జనరల్ ఆసుపత్రి పాలయింది! పోలీసుల నిఘాతో బతకవలసి వస్తోంది.

స్టాఫ్ నర్సు నడుచుకుంటూ కానుస్టేబుల్సు మధ్యనుండి

వస్తోంది.

జయంతి పులకించిపడింది. ఆమెను తానింతవరకూ చూడలేదు. తన వార్డులో ఇందాక 'మామూలు' అడగ వచ్చిన స్టాఫ్ నర్సు కాదు.

కొత్త స్టాఫ్ నర్సు జయంతి బెడ్ ను సమీపించింది. జయంతి ఆమెనే చూస్తోంది. భారీయెత్తు మనిషి. మొహం నిండా దట్టమైన పౌడరు కోటింగ్ పూసింది. ఎడం చెయ్యి కోటు జేబులో పెట్టుకుంది. ఆ చేతికి సన్నపాటి బెల్టువున్న లేడీస్ రిస్టువాచీ!

"అమ్మా, జయంతీ! ఎక్స్ రే తీయించాలి. తయారవు!" అంది కొత్త స్టాఫ్ నర్సు.

అనుమానంగా చూసింది జయంతి.

కొత్త స్టాఫ్ నర్సు జయంతి భుజాల క్రింద చేతులు వేసింది. జయంతికి బయిలుదేరక తప్పలేదు. నిజంగా ఎక్స్ రే తీయించడానికే అయివుంటుంది. కానిస్టేబుల్సుకి ఆ విషయం తెలిసే వుండాలి. వాళ్ళిద్దరి మధ్యనుండే కదా ఆమె నడుచుకుంటూ వచ్చింది.

జయంతి తన శరీరం మీది దుస్తులు సవరించుకుని బెడ్ దిగింది. కొత్త స్టాఫ్ నర్సు వెంట బయలుదేరింది.

కానిస్టేబుల్సు స్టాఫ్ నర్సును చూశారు. ఆమె నవ్వింది. వాళ్ళిద్దరూ మొహాలు చూసుకున్నారు.

"మీలో ఒకరు రండి! ఒక్కరిని వెంట పెట్టుకుని ఈమెను ఎక్స్ రే రూంకి తీసుకువెళ్ళమని ఇన్స్పెక్టరు కుమార్ ఫోన్ చేశారు!" అందామె.

ఒక కానిస్టేబులు వారివెంట బయలుదేరాడు.

ముగ్గురూ చెక్క మెట్లు దిగారు. నడవాలో అడుగు పెట్టారు. స్టాఫ్ నర్సు కానిస్టేబులు భుజం మీద చేయి

వేసింది.

కానిస్టేబులు పరవశంగా చూశాడు.

"ప్లీజ్! ఈ పక్క వార్డులో డాక్టర్ నరసింహం వున్నారేమో కనుక్కుని వస్తారా?" అంది కొత్త స్టాఫ్ నర్సు.

కానిస్టేబులు తలూపి ప్రక్క వార్డులోకి వెళ్ళాడు. సిస్టర్‌ను ప్రశ్నించాడు.

"డాక్టర్ నరసింహమా? ఆయన వుండేది మేడమీది వార్డులోనే." అంది సిస్టర్.

కానిస్టేబులు వార్డుబయటికి వచ్చాడు. చకచక నడుచుకుంటూ ఒక చివరగా వున్న ఎక్స్‌రే రూంని సమీపించాడు. కొత్త స్టాఫ్‌నర్సు గానీ, జయంతి గానీ కనిపించలేదు. రూంలో దర్యాప్తు చేశాడు.

"జయంతా? ఎక్స్‌రేయా? ఈరోజు ఎక్స్‌రేలు తీయడంలేదు. ప్లాంట్ పాడయింది!"అన్నాడు ఎక్స్‌రేలు తీసే ఉద్యోగి.

8

డిటెక్టివ్ శిరీష్ కుర్చీలో వెనక్కి వాలాడు.

బల్లకి అవతల కుర్చీలో కూర్చున్నాడు కుమార్. అతడు ఆలోచనలతో పగిలిపోతోన్న తలను తన రెండు చేతులతో పట్టుకున్నాడు.

శిరీష్ చెయ్యిచాపి బల్లమీది గ్రూప్ ఫోటోను అందుకున్నాడు. ఫోటో పైభాగంలో కాలేజి పేరు వుంది. చాంతాడంత పొడవైన పేరు. పెద్దాపురం. 1975-1976 థర్డ్ బి. ఎ. క్లాస్ అని వుంది.

"పీటర్, రంగారావులు క్లాసుమేట్స్ అయినంత మాత్రాన పీటర్‌కి రంగారావుని చంపవలసిన అవసరం

ఏం వచ్చింది?" అడిగాడు కుమార్.

"కాలేజీ దినాలనాటి పాత కక్షలయివుండాలి!" అన్నాడు శిరీష్.

"అయితే ఈ నాలుగు సంవత్సరాలపాటు పీటర్ ఏం చేస్తున్నట్టు?" కుమార్ గ్రూప్ ఫోటోను అందుకున్నాడు. ఫోటోను పరీక్షగా చూశాడు.

పీటర్ నిలబడిన వరసలో మొదటి వరుసలో ఒక చివరగా నిలబడివున్నాడు. ఫోటో అడుగుభాగంలో ఫోటోలో వున్నవారి పేర్లు ముద్రించడంవలన పీటర్‌ను గుర్తించటం చాలా సులువయింది. రంగారావు పై వరుసలో మధ్యలో వున్నాడు.

"పీటర్ ఫోటోకి కాపీలుతీయించి అన్ని పోలీసు స్టేషన్లకు పంపించావా కుమార్?" అన్నాడు శిరీష్ పీటర్ భారీ ఆకారాన్ని చూస్తూ.

"ఫోటోలే కాదు—అతడి వేలిముద్రలు కూడా?"

"వేలిముద్రలు పీటర్ వేనని గ్యారంటీ ఏమిటి?"

"అదేమిటి? జయంతి తనను రేప్ చేసింది పీటర్ అని రాసి యిచ్చిందికదా?"

"అయితే అతడి వేలిముద్రలు కత్తిమీద దొరకాలి కదా?"

కుమార్ పకపక నవ్వాడు. "వేలిముద్రలు ఫోటోల మాదిరిగా అచ్చుపడి వుంటాయా అవి. రాపిడిలో చెరిగి వుండాలి!"

శిరీష్ నవ్వి, "కాని జయంతి చెప్పిన మాటలు—అయ్‌మీన్ రాసియిచ్చిన కథనంలో ఒక విషయం వుంది. రంగారావు శవాన్ని ఆమె మంచంవద్ద నేలమీద

పడుకో బెట్టినప్పుడు జయంతి తన కళ్ళారా చూసింది. శవం గుండెల్లో గుచ్చుకొని వున్న కత్తిని అటూ ఇటూ కదిపాడు పీటర్. అతడి చేతులకు ఎలాంటి అచ్ఛాదనా లేదు. వ్రేలిముద్రలు ఏమాత్రం లేకుండా తుడిచిపెట్టినట్టుగా వుంది కత్తి” అన్నాడు.

“శవాన్ని విక్రమార్కుడిలాగా మోసుకువెళ్ళాడు పీటర్. భుజం మీద రాపిడివల్లనో బట్టల తాకిడివల్లనో వ్రేలిముద్రలు తుడిచినట్టుగా అయిపోతాయి.”

“సింహాచలం స్పృహతప్పాడు. అతడు త్రాగిన అల్కహాలులో మత్తుమందు కలిసివుంది. అతడు అల్కహాలు త్రాగిన సీసామీద అతడి వేలిముద్రలు లేవు. అంటే అల్కహాలు కలిపిన వ్యక్తి తన వేలిముద్రలతోబాటు అతడి వేలిముద్రలుకూడా చెరిపేశాడన్నమాట!”

“పీటర్ ప్రవర్తన విడ్డూరంగా వుంది.”

“వ్రేలిముద్రలు చెరిపిన వ్యక్తి పీటర్ కావడం అసాధ్యం?”

“అదేమిటి?”

“అవును. పీటర్‌కి వ్రేలిముద్రలు చెరిపే అలవాటు లేదు. అతడు చేసిన పనులన్నీ వెలుగులో బాహాటంగా చేసి తప్పుకున్నాడు.”

“ఈ కేసులో మరోవ్యక్తివున్నట్టు నువ్వు యింతవరకూ అనుమానించుకుంటున్నావన్నమాట!”

“అవును కుమార్! కేసు రానురాను క్లిష్టమవుతోంది?”

“యెలా?”

“సింహాచలం స్పృహతప్పాక లెవెల్ క్రాసింగ్ గేటును ఎవరు మూశారు?”

"పీటర్."

"ఆల్ రైట్ పీటర్ అనుకుందాం! ఆ రాత్రి మొత్తం రెండు గూడ్సు ట్రెయిన్లూ, మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్ళూ లెవెల్ క్రాసింగ్ గేటును దాటాయి. గేటులోంచి పోయే రహదారి రద్దీ అయిన రహదారి! గేటుకి అవతలా యివతలా వున్న చెక్‌పోస్టులలో ఆ రాత్రి చాలా వాహనాలు వెళ్ళినట్టు చెప్పుకున్నారు."

"రైట్.... చెప్పు!"

"మనం ఆ వాహనాల డ్రయివర్ల సహకారం అర్థించాం. ఆ రాత్రంతా యెవరో ఆ గేటును మూస్తూ తెరుస్తూ వున్నట్టు వాళ్ళు చెప్పారు."

"కరెక్ట్! అతడు పీటర్ అయివుండడు. పీటర్ ఆ సమయంలో జయంతితో వున్నాడు."

"అలా తెరుస్తోన్న వ్యక్తి భారీమనిషి కాడు. బవిరి గడ్డం లేదు!"

"............"

"మనలో యెవరో ఒకరు పెద్దాపురం వెళ్లాలి!"

"అవును. అక్కడ పీటర్ గురించి తెలియవచ్చు. పాత కక్షలకు కారణాలు తెలియవచ్చును."

బల్లమీది టెలిఫోన్ గణగణలాడింది.

కుమార్ రిసీవరు యెత్తాడు.

"కుమార్‌జీ! నేను జనరల్ ఆస్పత్రి సూపరెంటును మాట్లాడుతున్నాను."

"యెస్. చెప్పండి."

"జయంతి మాయమయింది!"

"నాన్సెన్స్!"

"నిజమే సార్! ఎవరో నర్సుతో కలిసి ఎక్సరేరూంకి

బయలు దేరింది. మధ్యలో మాయమయింది!"

"ఆ నర్స్ ఎవరు?"

"ఆమె మా నర్స్ కాదు! స్టాఫ్ నర్స్ వేషంలో వచ్చింది. భారీ ఎత్తుమనిషి!"

"మా కానిస్టేబుల్సు నిద్దరోతున్నారా?"

జనరల్ ఆసుపత్రి సూపరెన్టెంటు చాలాసేపు వివరించాడు. విషయం అర్థమయినట్టుగా నిట్టూర్చి కుమార్ రిసీవర్ను క్రెడిల్ చేశాడు.

శిరీష్ లేచాడు. "పీటర్ విశాఖపట్నంలో నే వున్నాడా!" అన్నాడు.

"నీకు ఎలా తెలిసింది?"

"ఆ భారీ ఎత్తు వేషంలో వచ్చి స్టాఫ్ నర్సుగా వ్యవహరించింది పీటర్! సందేహంలేదు."

"ఎంతకు తెగించాడు?"

"నువు అతడి విషయం చూసుకో!"

కుమార్ నిట్టూర్చి, "మరల రాక్షస రతికి గురయితే ఆమె బతకదు!" అన్నాడు.

"లంచాలు భోంచేయడంలో వున్న ఆసక్తి పనులు చేయడంలో వుండదు! అయినా వాళ్ళను నమ్ముకోవడం మన తప్పు."

9

"నాలుగేళ్ళనాటి సంగతా! నాకేం గుర్తువుంటుంది?" కళ్ళద్దాలు తీసి బల్లమీద పెట్టాడు ప్రిన్సిపాలు.

శిరీష్ ఆయనను పరీక్షగా చూశాడు. ఆయన చెప్పింది సహజమే! ఏడాదికి వెయ్యిమంది స్టూడెంట్స్ బయటికి వెళ్తుంటారు. వెయ్యిమంది వస్తుంటారు. వీళ్ళలో రంగారావు, పీటర్ గుర్తుండటం ఎలా సాధ్యం?

ఏదయినా ప్రత్యేక సంఘటన జరిగివుంటే తప్ప!

"ప్రిన్సిపాల్ గారూ! ఒప్పుకుంటాను. కనీసం ఈ గ్రూప్ ఫోటోలో వున్న వ్యక్తులు ఎవరైనా ఈ వూళ్ళో వున్నారేమో చెప్పగలరా? ప్లీజ్ ...."

ప్రిన్సిపాల్ గంభీరంగా నవ్వాడు.

"మీ యింటరాగేషన్‌కి నేనే దొరికానా?" అంటూ ఆయన గ్రూప్ ఫోటోను అందుకున్నాడు. పరిశీలనగా చూశాడు.

"నాతోబాటు కూర్చున్న లెక్చరర్లను అడిగి...."

ప్రిన్సిపాలు మాట ఆగిపోయింది.

"అరరె....ఇతడు థర్డు బి. ఏ. చదివాడా?" ఆశ్చర్యంగా చూశాడు ఆయన. ఆయన వ్రేలు గ్రూప్ ఫోటో మీద ఆగింది. ఆ వ్రేలువద్ద టక్ చేసుకున్న యువకుడు నిలబడి వున్నాడు. అతడి కుడిచెయ్యి రంగారావు భుజం మీద వుంది.

"వెరీగుడ్! అతడిని గుర్తుపట్టారా?"

"నిన్న నేను రిక్షా ఎక్కాను. రిక్షా పుల్లర్ యితడే!"

ప్రిన్సిపాల్ విచారంగా చూశాడు.

శిరీష్ పళ్ళు బిగించి, "ఈ దేశంలో ఇది సహజమైన పరిణామం! మీరు రిక్షా ఎక్కిన స్థలం గురించి చెప్పండి!" అన్నాడు.

"రాజరాజేశ్వరి టాకీసు వద్ద. అతడు అక్కడే పార్కింగ్ ప్లేస్‌లో వున్నాడు."

డిటెక్టివ్ శిరీష్ అతడి పేరుకోసం వెతికాడు.

లక్ష్మీపతి!

శిరీష్ ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుని కాలేజి ఆవరణలోంచి బయటకు వచ్చాడు. రోడ్డుకి అటూ యిటూ

భవనాలూ, షాపులూ వెలిశాయి. నిర్జనమైన ఒకప్పటి రోడ్లు కళాశాల తెచ్చిపెట్టిన నాగరికతలో, హంగులో తళతళలాడుతున్నాయి.

శిరీష్ రోడ్డు మలుపు తిరిగి సినిమాహాలు రోడ్డుకి వచ్చాడు. రిక్షాలు ఆగి వున్నాయి. ఒక రిక్షాలో సీటు మీద వెల్లకిలా పడుకుని బీడీ తాగుతున్నాడు లక్ష్మీపతి.

రిక్షాను సమీపించాడు శిరీష్.

"మిస్టర్ లక్ష్మీపతీ!" పిలిచాడు శిరీష్.

లక్ష్మీపతి చటుక్కున రిక్షా దిగి నిలబడ్డాడు.

"ఎవరు మీరు? నా పేరు మీకు ఎలా తెలుసు?" అడిగాడు లక్ష్మీపతి.

"రంగారావు. మీ క్లాసుమేటు—డిగ్రీలో."

లక్ష్మీపతికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

శిరీష్ అతడిని పరీక్షగా చూశాడు. కాలేజి దినాల్లో టక్ చేయనిదే బయటకు రానివాడు కాబోలు ప్రస్తుతం చిరిగిపోయిన నీలం చొక్కాను మాసిపోయిన పాంటు లోకి దోపాడు. మెడలో టైకి బదులుగా ఎర్రటి జేబు రుమాలు కట్టుకున్నాడు. రంగారావు పేరె త్తడంవలన గత స్మృతులు అతడిలో కలకబారినట్టు అర్థంచేసు కున్నాడు శిరీష్.

"రండి హోటల్‌లో కూర్చుందాం". శిరీష్ పది రూపాయలనోటు అందించాడు. "మరోలా అర్థంచేసుకో వద్దు. మీకు రిక్షా బాడుగ నష్టంకారాదు" అన్నాడు.

లక్ష్మీపతి నోటు అందుకున్నాడు. ఇద్దరూ హోటలులో ప్రవేశించారు. 'ఫామిలీ' అన్న గదిలో కూర్చున్నారు.

సర్వర్ వచ్చాడు. శిరీష్ అతడికి టిఫిన్ చెప్పి పంపించేశాడు.

"రంగారావును ఎవరో హత్యచేశారు!" అన్నాడు శిరీష్.

లక్ష్మీపతి బ్రిమ్మెరపోయాడు.

"పీటర్ చేసినట్లు కొన్ని ఆధారాలున్నాయి."

"పీటర్ .... వాడు నరరూప రాక్షసుడు!" పళ్ళు పట పటలాడించాడు లక్ష్మీపతి.

శిరీష్ ఓపికగా సమయం కోసం కాచుకున్నాడు.

లక్ష్మీపతికి ఆవేశం కట్టలు తెంచుకుంది.

10

రంగారావు సైకిలుకు స్టాండు వేశాడు. తాళంపెట్టి కారేజిమీదున్న పుస్తకాలు తీసుకుని క్లాస్ రూంవైపు నడిచాడు. రూంలో అడుగుపెట్టగానే చప్పట్లు వినిపించాయి.

పీటర్ లయగా క్లాప్స్ కొడుతున్నాడు. రంగారావు వేస్తోన్న స్టెప్స్‌కి అనుగుణంగా అవి మ్రోగుతున్నాయి. స్టూడెంట్సు నవ్వుతున్నారు. రంగారావు తెల్లబోయి అంతలోనే తేరుకుని వాళ్ళతో శ్రుతి కలిపాడు.

"మజ్నూ ఆగయారే!" ఎవరో కీచుమన్నారు.

రంగారావు ఉలిక్కిపడ్డాడు. తాను జయంతిని ప్రేమిస్తోన్న విషయం వీళ్ళకు ఎలా తెలిసింది? కేవలం జోక్‌గా అంటున్నారా?

"మజ్నూ ఏమిటి_?" అడిగాడు రంగారావు.

"సోమరాజు టాకీసులో లైలామజ్నూ ఉదయం ఆటలు_పయనమయ్యే ప్రియతమా...." రాగయుక్తంగా ఆలాపించసాగాడు పీటర్.

క్లాసు మరల నవ్వులతో మారుమ్రోగిపోయింది.

లెక్చరర్ రావడంతో క్లాసు సద్దుమణిగింది.

ఫస్టు అవర్ కాగానే రంగారావుగారూ అంటూ పదేళ్ళ కుర్రాడు వచ్చాడు. రంగారావు క్లాసులోంచి బయటకు నడిచాడు. కుర్రాడు అతడికి కవరు అందించి పారిపోయాడు. రంగారావు తెల్లబోయి కవరు అందు కున్నాడు. కవరుమీది చేతిరాతను సులువుగా గుర్తు పట్టాడు. జయంతి రాసిన అక్షరాలవి. మార్చిరాసింది.

చటుక్కున కవరు తెరిచాడు. కవరులో చిన్నసైజు కాగితం వుంది. కాగితం మీద కంగారుగా రాసినట్టు పెన్సిలు రాత వుంది. రంగారావు చదువుకున్నాడు.

"సాయంకాలం అయిదు గంటలకు పాండవుల మెట్టవద్ద మెట్లక్రింద నీ కోసం కాచుకుంటాను."

—జయంతి."

రంగారావుకి గుండె ఝల్లుమంది. జయంతికీ తనకీ వుత్తర ప్రత్యుత్తరాలు కొత్తకాదు. అయినా ఆమె ఎప్పుడు వుత్తరం రాసినా తనకి గుండె ఝల్లుమంటూనే వుంటుంది.

రంగారావు కవరునూ, ఉత్తరాన్ని జేబులో పెట్టు కున్నాడు.

* * *

జయంతి మెల్లగా నడచుకుంటూ రాజుగారి కోటవద్ద ఆగింది.

కోటకి వున్న చారిత్రక ప్రాధాన్యతకి రుజువుగా చాలవరకూ కరిగిపోయిన మట్టిగోడలూ, వాటికి మధ్యగా ఎత్తయిన కోట సింహద్వారమూ ఇంకా వున్నాయి.

జయంతి సింహద్వారంవైపు చూస్తోంది. ఆ తలుపుల వద్ద వుండమని తాను రంగారావుకు ఉత్తరం రాసింది. నాలుగున్నరకి అక్కడ వుండమన్నది. అయితే రంగారావు

నాలుగు గంటలకే తన కోసం కాచుకుని వుండాలి. అతడి మనసు తనకు బాగా తెలుసు.

జయంతి అటూ ఇటూ చూసింది. తనని ఎవరూ చూడటంలేదు. అయినా ఈ ప్రాంతంలో తాను ఎవరికీ తెలియదు. తలుపుల వద్దకు నడిచి ఆగింది జయంతి. శతాబ్దాలనాటి వాతావరణ పరిస్థితులకు తలుపులు పెట్లి పోయి పొరలుగా విడిపోయాయి.

జయంతి వాచీ చూసుకుంది. సాయంత్రం అయి దయింది.

జయంతి లోపలకు తొంగిచూచింది. కోట గుమ్మం లోపల చెదలపుట్టలు మేడలువేశాయి. వాటికి కాస్త యివతలగా విశాలమైన ఊడలు పెంచుకొన్న వటవృక్షం. దూరంగా పెంకుటి బంగళాలు. మధ్యలో ఎకరాలకొలది భూమి. అడ్డూ అపూ లేకుండా పెరిగిన చిట్టిపొదలు. వాటికి మధ్యలో పెద్ద సిమెంట్ దీపాలు. రోడ్డుమీద జనం నడుస్తున్నారు. వాహనాల హోరు వినిపిస్తోంది.

మర్రిచెట్టు ప్రక్కన ఎవరో కదిలినట్టయింది.

'రంగారావు!' జయంతి గుండె ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజన్‌లా కొట్టుకుంది. చకచక ఊడల మధ్యకు పరు గెత్తింది. జయంతి అకస్మాత్తుగా ఆగింది. అతడు రంగారావు కాదు. భారీ ఎత్తు మనిషి! పీటర్!

జయంతి వెనక్కి తిరగబోయింది. అప్పటికే పీటర్ ఆమెను సమీపించాడు. అతడి చెయ్యి ఆమె నోటిని బలంగా అదుముతోంది. రెండో చేత్తో ఆమె ముక్కు మీద జేబు రుమాలు అదిమాడు.

తియ్యటి వాసన! పీల్చకూడదనుకుంటూనే జయంతి గుండెలనిండా తియ్యటి గాలిని పీల్చుకున్నది. క్షణాలల్లో

జయంతి అతడి చేతులలో వాలిపోయింది. ఆమెను నేల మీద పడుకోబెట్టాడు పీటర్.

పీటర్ ఆమెమీద పడ్డాడు.

* * *

జయంతి కళ్ళు తెరిచింది. చుట్టూ చూచింది. తాను బెడ్ మీద పడుకున్నది. ఒళ్ళంతా సూదులతో పొడుస్తోన్నట్టు నరకయాతనగా వుంది. ముఖ్యంగా జీర్ణాశయం దిగువ భాగం శూలాలతో గుచ్చుతోన్నట్టుగా కండరాలు కోస్తోన్నట్టుగా ఒకటే బాధ!

రంగారావు ఆమెమీదకు వాలాడు.

"జయా!" అన్నాడు. అతడి కళ్ళు ఎర్రగా వున్నాయి. కళ్ళలో తడి!

ఆమె చెయ్యి కదపబోయింది.

"చెయ్యి కదపక జయా! గ్లూకోజ్ ఎక్కుతోంది!" రంగారావు గొంతు బొంగురుగా వుంది.

"నాకు ఏం జరిగింది? ఇక్కడికి ఎలా వచ్చాను."

"నిన్న రాత్రి ఏడు గంటలకు కోటముందు రోడ్డుమీద స్పృహ తప్పి పడివున్నావు. నిన్ను యెవరో దారుణంగా చెరిచారు" రంగారావు కళ్ళు వర్షించాయి.

జయంతి పెదిమలు బిగుసుకున్నాయి.

"పీటర్! దుర్మార్గుడు!" గొణుక్కున్నది.

ప్రక్కగా యెవరో వచ్చి నిలబడ్డారు. డాక్టర్!

"ఆపరేషన్‌కి ఏర్పాట్లు జరిగాయి. కాని...." ఆగిపోయాడు డాక్టర్!

ఏమిటన్నట్టు చూశాడు రంగారావు.

జయంతి నిర్లిప్తంగా వింటోంది.

"యూట్రెస్ బాగా దెబ్బతిన్నది. ఈ ఆపరేషన్‌కి

ఒప్పుకుంటే పిల్లలు పుట్టరు."

"ఒప్పుకోకపోతే!"

"సెప్టిక్ అయ్యే ప్రమాదం వుంది! ప్రాణాలకు మోసం!"

"డాక్టర్ ...." రంగారావు గొల్లుమన్నాడు. "డాక్టర్! ఆమె బతకాలి!" డాక్టర్ తలూపాడు.

11

"జయంతికి ఆపరేషన్ సక్సెసయింది. పీటర్‌కి అయిదు సంవత్సరాల కఠినశిక్ష వేశారు." అగాడు లక్ష్మీపతి.

శిరీష్ నిట్టూర్చాడు.

ఇద్దరూ మౌనంగా టిఫిన్ తినసాగారు. సర్వరు కాఫీ కెచ్చి పెట్టాడు.

"పీటర్‌ని రాజమండ్రి సెంట్రల్ జైయిలుకి పంపించారా?" అడిగాడు శిరీష్.

"అవును."

"జయంతి తరపున యెవరూ లేరా?"

"ఆమె అనాధశరణాలయంలో వుండి కాలేజిలో ఇంటర్ చదివేది!"

"పీటర్‌కి ఆమెమీద కక్ష యెందుకు?"

"కక్ష కాదు—పిచ్చి ప్రేమ."

"అలా అని వాఙ్మూలంలో చెప్పాడా?"

లక్ష్మీపతి తలూపాడు.

"చాలా థాంక్స్ లక్ష్మీపతిగారూ! చాల ఉపయోగకరమైన సమాచారం యిచ్చారు."

"రంగారావు చాలా మంచివాడు."

"అవును. అతడిని కిరాతకంగా వెంటాడాడు పీటర్.

ఆల్ రైట్! నేను రాజయ్య ఇంటికి వెళ్తాను."

"మీకు ఈ ఊరు తెలుసా?"

"1968 వరకూ యిక్కడే వుండేవాడిని. వీరరాజు హైస్కూలులో చదువుకున్నాను—1968 బేచ్—యెస్. యెస్. యెల్. సి."

"చాలా సంతోషం సార్!"

శిరీష్ అతడిని భుజంతట్టి, "లేద్దామా?" అన్నాడు.

12

ఇన్స్పెక్టర్ కుమార్ జీపు దిగాడు. లెవల్ క్రాసింగ్ గేటు దాటి స్టేషన్ ప్లాట్‌ఫాంమీద అడుగు పెట్టాడు. రేకుషెడ్డు బయట అసిస్టెంట్ స్టేషన్ మాష్టర్ ఎవరితోనో మాట్లాడుతూ కనిపించాడు.

ఇన్స్పెక్టర్ కుమార్‌ను చూడగానే విష్ చేశాడు. కొత్తగా యీ పదవిలోకి వచ్చిన అసిస్టెంట్ స్టేషన్ మాష్టర్ గోపాలం.

"ఈయన యిక్కడి క్లర్కు. సెలవు అయిపోగానే జాయినయ్యారు" అన్నాడు గోపాలం.

ఇన్స్పెక్టర్‌ను విష్ చేశాడు క్లర్కు.

"మీ పేరు?" అడిగాడు ఇన్స్పెక్టర్ కుమార్.

"కనకారావు."

"మీరు ఎప్పటినించీ ఈ స్టేషన్‌లో సర్వీస్‌లో వున్నారు?"

"మూడు సంవత్సరాలనుండీ. నా అపాయింట్‌మెంట్ యిక్కడే జరిగింది!"

"ఈ మధ్యకాలంలో యిక్కడ లెవల్ క్రాసింగ్ వద్ద యాక్సిడెంటయిందట—ఆ విషయం తెలుసుకుందామని వచ్చాను."

కనకారావు విచిత్రంగా చూశాడు.

"యాక్సిడెంట్ విషయం మీకు ఎవరు చెప్పారు?" అడిగాడు కనకారావు.

"దర్యాప్తులో తేలింది. లెవెల్ క్రాసింగ్ వద్ద వుండే సింహాచలానికి తాగి పడుకోవడం అలవాటేనట గదా!"

"అవును సార్! మూడు వారాల క్రితం యాక్సిడెంటయింది. గేటు మూసిలేదు. పెళ్ళికి వెళ్తోన్న ఎడ్ల బండిని పాసింజర్ ట్రయిన్ ఢీకొట్టింది."

"ఎంతమంది మరణించారు?"

"మరణించింది ఒక్కరే. ఎడ్లు చచ్చిపోయాయి! అందరికీ గాయాలు మాత్రం తగిలాయి!"

"పెళ్ళివారి కంప్లయింటులో నలభై తులాల బంగారం పోయినట్టు వుంది!"

"అవును సార్! నగల పెట్టె పోయినట్టు పెళ్ళివాళ్ళు గోల తిపోయారు. ఆ రోజు సింహాచలం సెలవుపెట్టి మరి ఒకరిని తన స్థానంలో వుంచి వెళ్ళాడు. ఆ కొత్త వాడిని అధికారులు ఉద్యోగంలోంచి తొలగించారు."

"నగల పెట్టె ఏమయివుంటుంది?"

"అదే ఆశ్చర్యం సార్! రైలుపట్టాలమీద ఎక్కడా పెట్టె దొరకలేదు. వాళ్ళ బంధువులలోనే ఎవరో ఒకరు ఆ పెట్టెను అపహరించి వుండాలి సార్!"

"మీరు సెలవు పెట్టి ఎక్కడికి వెళ్ళారు?"

"మా తండ్రిగారికి పక్షవాతం తగిలింది సార్! దగ్గర వుండి ఆయనను చూసుకోవలసి వచ్చింది!"

"ఎక్కడయినా కూర్చుండి మాట్లాడుకుందాం. రండి సార్!" అన్నాడు గోపాలం.

"మా క్వార్టర్‌లో కూర్చుందాం రండి సార్!" అన్నాడు కనకారావు.

"నేను కనకారావుగారి క్వార్టర్‌లో కూర్చుంటాను. డిటెక్టివ్ శిరీష్ వస్తే అక్కడికి పంపించండి" కుమార్ దారితీశాడు. కనకారావు అతడిని వెంబడించాడు.

"మీకు యింకా పెళ్ళి కాలేదా?" అడిగాడు కుమార్.

"అయింది సార్. డెలివరికి పంపించాను" కనకారావు క్వార్టర్ తాళం తెరచి, "లోపలికి రండి సార్!" అన్నాడు.

కుమార్ క్వార్టరులో ప్రవేశించాడు. బొగ్గు పొగతో మసిబారిన గోడలు వికృతంగా వున్నాయి.

"రాక్షసి బొగ్గుతో బాయిలర్ పెడతారా మీ యింట్లో" అడిగాడు కుమార్.

"అవును సార్! ఆ బొగ్గు చవక!"

"చవకకాదు....ఫ్రీగా వస్తుంది!" కోపంగా చూశాడు కుమార్. కనకారావు రెండు కుర్చీలు వాల్చాడు. ఇద్దరూ కూర్చున్నారు.

"కాఫీ పెడతాను సార్! ఒక్క నిమిషం!" లేచాడు కనకారావు. వంటింట్లోకి నడిచాడు.

కుమార్ చటుక్కున లేచి గదిలోవున్న టేబులువద్దకు నడిచాడు. టేబులు ప్రక్కగా వున్న మూల గాజు అద్దం పగిలిన ముక్కలు కనిపించాయి. టేబులు క్రింద ఫోటో ఫ్రేమువుంది. కుమార్ గోడవైపు చూశాడు. గోడలకి ఫామిలీ ఫోటోలూ, కాలెండర్లూ తగిలించివున్నాయి.

కుమార్ చూపు గోడమీద నిలబడిపోయింది. గోడకి చిన్న సైజులో కనకారావు బస్టు ఫోటో తగిలించివుంది.

దానిచుట్టూ దీర్ఘ చతురస్రాకారంలో తెల్లటి మరక!

గుమ్మం దగ్గర చప్పుడయింది. కుమార్ తలత్రిప్పి చూశాడు.

డిటెక్టివ్ శిరీష్ లోపలికివస్తూ కనిపించాడు. కుమార్ విష్ చేశాడు.

"పీటర్, మూడు వారాల క్రితం రాజమండ్రి సెంట్రల్ జెయిలునుంచి విడుదల అయ్యాడు. ప్రవర్తన మార్చుకున్నట్టు నటించి, ఏడాది ముందే జెయిలులోంచి బయట పడ్డాడు" అన్నాడు శిరీష్.

"రాజమండ్రి కూడా వెళ్ళివచ్చావా?"

శిరీష్ తలూపాడు.

కనకారావు తొంగిచూచి మరల లోపలకు వెళ్ళాడు.

శిరీష్ అతడిని చూచి నుదురు చిట్లించాడు.

కుమార్ కళ్ళతో సైగచేశాడు. శిరీష్ గోడవైపూ టేబులు ప్రక్కగా గది మూలవైపూ చూచి ఊరు కున్నాడు.

ట్రేతో కాఫీ కప్పులు తెచ్చి ఇద్దరికీ చెరొకటీ యిచ్చి తనో కప్పు తీసుకున్నాడు కనకారావు.

"రంగారావు హత్య జరిగి ఈనాటికి మూడు రోజు లయింది. ఈ మూడు రోజులుగా ఈ ప్రాంతంలో మీకు మరల పీటర్ కనిపించాడా?" అడిగాడు కుమార్.

"లేదు సార్! నేను రంగారావు మరణించిన మర్నాటి ఉదయం అంటే మే తొమ్మిదో తారీఖునాడు డ్యూటీలో జాయినయ్యాను. పైగా అతగాడు ఎలా ఉంటాడో కూడా నాకు తెలియదు సార్!" అన్నాడు కనకారావు.

"రాత్రిపూట మీకు భయంగా ఉంటుందా?"

"ఎందుకు సార్ భయం? రంగారావుకులాగా నాకు

పాత కక్షలున్నవాళ్లు ఎవరూ లేరు."

"మనం వెళ్దామా?" లేచాడు డిటెక్టివ్ శిరీష్.

ఇద్దరూ కనకారావు వద్ద సెలవు పుచ్చుకుని బయలు దేరారు.

గోపాలానికి చెప్పి కుమార్ జీపు స్టార్టు చేశాడు. జీపు బయలుదేరింది. శిరీష్ తను పెద్దాపురంలో తెలుసుకున్న విషయాలు చెప్పి, "రాజమండ్రి సెంట్రల్ జెయిలులో పీటర్ కి ఉత్తరాలు వచ్చేవి. విశాఖపట్నం నుండి వాత్తేరు వెళ్ళే ఆర్.ఎం.ఎస్.లో పోస్టు అయేవి" అన్నాడు.

"అంటే ఎక్కడా పోస్టు ఆఫీసులో ముద్రపడేవి కావన్నమాట!"

"అవును."

"చెప్పు."

"పీటర్ బయలుదేరేముందు ఒక ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం అందేలోపుగానే అతడు గోదావరి ఎక్స్ప్రెస్ పట్టుకున్నాడట!"

"ఐ.సీ.... ఏదీ ఆ వుత్తరం?"

డిటెక్టివ్ శిరీష్ తన పాంటు జేబులోంచి కవరు తీశాడు.

"పీటర్ గురించిన గుర్తులు సెంట్రల్ జెయిలుకి వెళ్ళడం వలన అక్కడి ఉద్యోగులు నాకు మరింత సహకరించారు" అంటూ శిరీష్ కవరులోంచి చిన్న కాగితం తీశాడు. చదవసాగాడు.

పీటర్!

ఒకసారి ఇక్కడికిరా, వివరంగా మాట్లాడు

కుందాం. మనం కొనబోయే సైట్ చూడటం మంచిది! నేను సెలవు పెడతాను.

—మిత్రుడు.

"సైటు ఏమిటి?" అడిగాడు కుమార్.

"కేసుకు ఒక స్వరూపం ఏర్పడుతోంది. అన్నట్లు నువ్వు కనకారావు మీద పని పెట్టుకున్నావేం?"

"రంగారావు మరణించిననాడు ఉదయం మనం అతడి క్వార్టర్ వెతికాం. గుర్తుందా?"

"అవును రంగాగావు తన రక్తంతో రాసిన అక్షరాల ప్రకారం గ్రూప్ ఫోటోకోసం వెతికాం."

"అప్పటికే అతడి క్వార్టరును ఎవరో వెతికారని నువ్వు అనుమానపడ్డావు."

"అంతేకాదు—వెతికినవాడు చేతికి గ్లవ్స్ వేసుకుని ఉండాలి!"

"పీటర్ కాదు. అయితే ఎవరు. అతడికి క్వార్టరును వెతకవలసిన పని ఏమిటి? అని నేను ఆరా తీశాను. డివిజినల్ సూపర్నెంటు లెవెల్ క్రాసింగ్ గేటువద్ద ఇటీవల జరిగిన యాక్సిడెంటు గురించి చెబుతూ బంగారు నగలపెట్టె పోయినట్టు చెప్పారు. ఆ పెట్టె పెళ్ళి బృందానికి సంబంధించిన వారిది."

"వెరీగుడ్....కొస అందుతోంది. చెప్పు."

"పీటర్‌కి సహాయపడిన వారెవరో ఆ పెట్టె తన స్వంతం చేసుకోవాలని ఆశించివుంటారు."

"అంటే ఆ బంగారు నగలపెట్టె రంగారావుకి దొరికివుండాలి!"

"వెరీగుడ్. పీటర్‌కి జయంతిని ఎరవేసి అతడు ఆ

నగల పెట్టెను ప్రతిఫలంగా తీసుకోవాలనుకున్నాడు."

"పీటర్ జాడ తెలిసిందా?"

"లేదు. అన్ని బస్ స్టాపులలో, రైలు స్టేషన్‌లో పోలీస్ నిఘా ఉంచాను."

"కనకారావు మీద నీకు అనుమానం ఎలా వచ్చింది?"

"వాచ్‌మాన్ సింహాచలం యాక్సిడెంట్ జరిగిననాటి రాత్రి స్టేషన్‌లో లేడు. అతడు తిరిగి డ్యూటీలో చేరే టప్పటికి రంగారావూ కనకారావూ తగాదాపడు తున్నారట. సింహాచలం రావడం చూచి వాళ్ళు తగాదా ఆపేవారట! సింహాచలం ఒకసారి చాటునుండి విన్నాడట. బంగారు నగలపెట్టె ప్రసక్తి వచ్చిందట! అతడు తనకు యెందుకు వచ్చిన విషయం అని వూరుకున్నాడట."

"కనకారావుకు నగలపెట్టె ఇంకా దొరికి ఉండదు."

"యెలా చెప్పగలవు?"

"జయంతి యింకా దొరకలేదు కదా, ఇందాక మీ పోలీస్ స్టేషన్‌కి వస్తే సార్జంటు చెప్పాడు."

"అంటే ఆ నగలపెట్టె ఆచూకీ కోసమే ఆమెను పీటర్ యెత్తుకు పోయాడంటావా?"

"అవును."

"రంగారావును హత్యచేసిన నాటి రాత్రే ఆమెనుండి పెట్టె రహస్యం లాగి ఉండవచ్చు కదా!"

"పీటర్‌కి నాలుగు కఠిన సంవత్సరాల శిక్ష తర్వాత జయంతి ఒంటిగా దొరికింది! పైగా అతడికి సహకరించిన వ్యక్తి, పెట్టె దొరకకపోతుందా అన్న అతి విశ్వాసం ప్రదర్శించి వుంటాడు!"

శిరీష్ ఆలోచనలో పడ్డాడు. జేబులోంచి కాగితం తీసి తదేకంగా చూస్తూ కూర్చున్నాడు.

13

సాయంకాలమవుతోంది.

డిటెక్టివ్ శిరీష్ ఓపికగా టాక్సీలో కూర్చున్నాడు. టాక్సీని రప్పించి నాలుగు గంటలయింది. టాక్సీ మొహం విశాఖపట్నంవైపు వుంది. శిరీష్ వెనక్కి చూడసాగాడు. దూరంనుండి ఏదో సైకిలు వస్తోంది.

శిరీష్ కళ్ళు మెరిశాయి.

కనకారావు సైకిలు త్రొక్కుకుంటూ వస్తున్నాడు.

తాను ఆశించినట్టుగాగాక డ్యూటీ ముగిశాక తాపీగా బయలుదేరాడు. శిరీష్ అతడినే దీక్షగా చూడసాగాడు.

కనకారావు ఇటూ యిటూ చూసుకుంటూ త్రొక్కుతో వస్తున్నాడు. అతడి సైకిలు టాక్సీని దాటింది. సైకిలును కనుచూపుమేర వరకూ వెళ్ళనిచ్చి డ్రైవర్‌ను సైగ చేశాడు శిరీష్.

శిరీష్ కూర్చున్న టాక్సీ బయలుదేరింది.

సైకిలు ప్రిన్స్ ప్రిన్సెస్ లాడ్జి ముందు ఆగింది. కనకారావు చుట్టూ చూసుకుంటూ లాడ్జి ఆవరణలోనికి సైకిలును నడిపించాడు, పార్కింగ్ ప్లేసులో సైకిలుకు స్టాండువేశాడు.

కౌంటర్ ముందునుండి నడిచివెళ్ళి మెట్లు యెక్కాడు. 14వ నెంబర్ గదిముందు ఆగాడు. మునివ్రేళ్ళతో తలుపు తట్టాడు.

వరండా నిర్జనంగా వుంది.

తలుపు తెరుచుకుంది.

కనకారావు చప్పున లోపలికి గెంతాడు.

"లాభంలేదు కనకారావూ! జయంతికి బంగారం విషయం తెలియదు" అన్నాడు పీటర్, తలుపు దగ్గరగా

చేర వేసి.

అతడు నడుముకు అస్తవ్యస్తంగా లుంగీ చుట్టుకున్నాడు.

"పీటర్! నీ వరస నాకు నచ్చలేదు. దాన్ని బతకనివ్వవా?" అడిగాడు కనకారావు.

పీటర్ చాచి లెంపకాయ కొట్టాడు.

"వాడు చచ్చినప్పటినుండి జయంతి నా పెళ్ళాం. అమర్యాదకరంగా మాట్లాడక!"

కనకారావుకు పెదిమ చిట్లించింది. రక్తం ఉప్పగా నాలుకకు తగిలింది.

"పీటర్! నీ యెత్తు నాకు తెలుసు!"

"ఏం తెలుసు?"

"జయంతిని సొంతం చేసుకుని, ఆ నగల పెట్టెను నీ సొంతం చేసుకోవాలని పథకంవేశావు" కనకారావు లోపలికి నడిచాడు.

అతని భుజం పట్టుకు ఆపాడు పీటర్.

"నిజం చెప్పాను. నమ్మకపోతే—మానుకో!"

"నేనూ పోలీసులకు నిజం చెప్పవలసివస్తుంది!"

"నువు బతికివుంటే?"

"ఆఁ!"

"నేను తెగించినవాడిని! వెలుగులో హత్య చేశాను. అందరికంటా పడ్డాను. అయినప్పటికీ నన్ను యిప్పటివరకూ ఎవడూ పట్టుకోలేకపోయాడు. నిన్ను చంపినా అంతే!"

కనకారావు భయంగా చూశాడు.

"పోనివ్వు. ఆ నగల పెట్టెలో సగం నగలు యివ్వు. చాలు!" అన్నాడు కనకారావు.

ఇద్దరూ జయంతి పడుకున్న బెడ్ ని సమీపించారు.

జయంతి మొహం పీక్కుపోయింది. జుత్తు రేగివుంది.

"జయా! నగలపెట్టె కోసం వచ్చాడు కనకారావు. ఎక్కడుందో రాయి!" పీటర్ ఆమెకు కాగితం కలం అందించాడు.

ఆమె ఏడుస్తోంది.

పీటర్ ఆమెను జుత్తు పట్టుకున్నాడు.

"త్వరగా చెప్పు జయంతీ! మనకోసం పోలీసులు కాలుకాలిన పిల్లుల్లాగా తిరుగుతున్నారు" అరిచాడు కనకారావు.

తలుపులు భడాలున తెరచుకున్నాయి.

పోలీసులు లోపలకు వచ్చారు.

కనకారావునూ, పీటర్‌నూ భుజాల క్రింద చేతులువేసి పట్టుకున్నారు.

శిరీష్, కుమార్ గదిలోకి ప్రవేశించారు.

"చూడు జయంతీ! కనకారావు అనాధశరణాలయంలో నీతోబాటు పెరిగాడు కదూ!" అడిగాడు కుమార్.

జయంతి తలూపింది.

"పీటర్‌కీ నీకూ మధ్య జరిగిన అఘాయిత్యం గురించి కనకారావుకు తెలుసు. అందుకే అతడు పీటర్‌కు సహకరించాలనుకున్నాడు. పీటర్‌కి అతడు స్నేహితుడు."

జయంతి కళ్ళు విప్పుకు వింటోంది.

పోలీసులు పీటర్‌కీ, కనకారావుకీ కలిపి సంకెళ్ళు వేశారు.

"సార్! వీడు—ఈ పీటర్ నగలపెట్టె అపహరించి.... నిజం సార్!" కనకారావు పిచ్చిగా మాట్లాడసాగాడు. మో చేతితో ఇన్‌స్పెక్టర్ కుమార్ అతడి డొక్కలో

ఘమ్మ్రాడు.

కనకారావు కెవ్వుమన్నాడు.

“నగలపెట్టె మాట దొరికింది! లెవెల్ క్రాసింగ్ కాబిన్‌లో పెద్ద చందువాపెట్టె అడుగున పెట్టాడు రంగారావు. అది భద్రంగా ఉన్నట్టు చూసుకోవడానికే అతడు రాత్రివేళ తరచు గేటు తణిఖీకి వెళ్ళేవాడు” అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

కనకారావూ, పీటరూ మొహాలు చూసుకున్నారు.

— :ఐపోయింది: —